## ఉద్దేశపూర్వకంగానే జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్

**• ఏకపక్షంగా చర్యలు బాధాకరం • మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, పక్కన ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

నందికొండ, మార్చి 16 : మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడం అనైతికమని మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. నాగార్జునసాగర్ పైలాన్‌కాలనీలో ఆదివారం ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కారణం లేకుండా జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ సెషన్ వరకు సస్పెన్షన్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎవరిని అవమానించినట్లు జగదీశ్‌రెడ్డి మాట్లాడలేదని, ప్రజాస్వామ్య బద్ధంగా మాట్లాడినా సస్పెన్షన్ చేయడం చాల అన్యాయమని తెలిపారు. తప్పుగా మాట్లాడిన వాఖ్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరినా వాటిని పట్టించుకోకుండా ఏక పక్షంగా సస్పెన్షన్ నిర్ణయం తీసుకోవడం చాలా బాధాకరమని చెప్పారు. రుణమాఫీ చేయలేదని, రైతు బంధు సగం మందికి ఇవ్వలేదని, ఆరు గ్యారెంటీలు అమలు చేయలేదని అనే అంశాలపై ఈ సెషన్‌లో లేవనెత్తి కాంగ్రెస్ తీరును ఎండగడుతాడని ఉద్దేశంతోనే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేశారని విమర్శించారు. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీలో ఉమ్మడి నల్లగొండ జిల్లా సమస్యలు వినిపించే గొంతుక జగదీశ్‌రెడ్డి అని, జగదీశ్ రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని బీఆర్ఎస్‌తోపాటు ఇతర పార్టీలు సైతం తీవ్రంగా వ్యతిరేఖిస్తున్నాయని తెలిపారు. దళిత పక్షపాతిగా ఉన్న వ్యక్తి జగదీశ్‌రెడ్డి, దళిత నేతను అవమానించారనడం సరికాదని అన్నారు. మంత్రిగా ఉన్నప్పుడు ఆయన దళితుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని చెప్పారు. జగదీశ్‌రెడ్డిపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేసి వెంటనే అసెంబ్లీకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వారితోపాటు కౌన్సిలర్ రమేశ్‌జీ, పెద్దవూర బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జటావత్ రవి నాయక్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

## 20న సూర్యాపేటకు కేటీఆర్ ?

**• బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరు**



సూర్యాపేట, మార్చి 16 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఈ నెల 20న సూర్యాపేటకు రానున్నట్లు సమాచారం. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం స్థాపించిన బీఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఏప్రిల్ 27న వరంగల్‌లో భారీ బహిరంగ సభ తలపెట్టిన విషయం విదితమే. బహిరంగ సభ విజయవంతం కోసం ఈ నెల 20న సూర్యాపేట జిల్లా స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం జరుగనుండగా, దానికి కేటీఆర్ హాజరుకానున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది.

ఈ ఫొటోలోని రైతు పేరు మోటె నరసింహ (50). రామన్నపేట మండలంలోని సిరిపురం. నరసింహ గ్రామంలోనే పది ఎకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. దీనికోసం అప్పు చేశాడు. పొలం ఎండిపోతుండటంతో ఈ నెల 10న మనస్థాపంతో వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు.



చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామానికి చెందిన అంతటి జగన్(45) బోర్ వెల్స్‌లో, వ్యవసాయంలో అప్పులపాలై కొంతకాలంగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. దీంతో మనస్థాపం చెంది.. తన వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగి సూసైడ్ చేసుకున్నాడు. ఈ ఘటన ఈ నెల 12న చోటుచేసుకుంది.



ఈ చిత్రంలో ఉన్న అన్నదాతది తుర్కపల్లి మండలంలోని వీరారెడ్డిపల్లి. పేరు మంద చంద్రయ్య(55). తనకున్న ఎకరన్నరలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ మధ్యకాలంలో సాగు నీళ్లందక సుమారు 5 బోర్లు వేసినా ఫలితం దక్కలేదు. ఎకరన్నరలో వేసిన పత్తి, వరి పంటలు పూర్తిగా ఎండిపోవడంతో మనోవేదనకు గురై ఫిబ్రవరి 23న వ్యవసాయ క్షేత్రం వద్ద పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు.





గుర్రంపోడ్‌లో నిరసనలో పాల్గొన్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు

## సభలో ప్రశ్నిస్తారని భయంతోనే చర్యలు

**• జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలి**
**• ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి**

గుర్రంపోడ్, మార్చి 16 : మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిని కుట్రపూరితంగానే ప్రభుత్వం సస్పెండ్ చేసిందని, ప్రజా సమస్యలపై నిలదీస్తారనే భయంతోనే అసెంబ్లీ నుంచి బయటికి పంపించిందని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. జగదీశ్‌రెడ్డి సస్పెండ్‌ను నిరసిస్తూ ఆదివారం గుర్రంపోడ్ మండల కేంద్రంలో రోడ్డుపై బైఠాయించి బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆయన ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కోటిరెడ్డి మాట్లాడుతూ ప్రశ్నించే వారిని సభ నుంచి బయటికి పంపించడమే పనిగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో నిలదీస్తుండడంతో ఇలా చేస్తున్నదని తెలిపారు. అకారణంగా జగదీశ్ రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాశం గోపాల్ రెడ్డి, పోలె రామచంద్రం, మునుకుంట్ల రాజేశ్‌రెడ్డి, వడిత్య నాగరాజు నాయక్, జాల మల్లేశ్, మునుకుంట్ల బాల్ రెడ్డి, కుంభం ప్రశాంత్ రెడ్డి, కూనూరు సైదిరెడ్డి, వేముల యాదయ్య, కుంటిగొర్ల లింగయ్య, ఇస్మాయిల్, శ్రీధర్, నల్ల శ్రీరాములు, కృష్ణ గౌడ్, కన్నెబోయిన అంజయ్య పాల్గొన్నారు.

**ఆలేరులో సీఎం దిష్టిబొమ్మ దహనం**

ఆలేరు టౌన్ : జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌ను నిరసిస్తూ ఆదివారం ఆలేరు పట్టణంలోని ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బైఠాయించి రాస్తారోకో చేశారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంగుల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేశం గౌడ్ మాట్లాడుతూ రైతులు గోస పడుతున్నారని, వారి సమస్యలు తీర్చాలని అసెంబ్లీలో ప్రశ్నించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేస్తారా? ఇది హేయమైన చర్య అని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు కంట నీరు తప్ప లాభం లేదన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, పంటలకు నీరందించడం లేదని మండిపడ్డారు. వరి పొలాలు ఎండిపోతుంటే రైతులు అరిగోస పడుతున్నారని, వారి పక్షాన మాట్లాడడం తప్పా ? అని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై నిలదీస్తారనే భయంతోనే జగదీశ్‌రెడ్డిని ఉద్దేశపూర్వకంగా సస్పెండ్ చేశారని విమర్శించారు. జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచులు ఆరుట్ల లక్ష్మీప్రసాద్‌రెడ్డి, బక్క రామ్‌ప్రసాద్, ఏసిరెడ్డి మహేందర్‌రెడ్డి, చింతకింది మురళి, బీఆర్ఎస్ నాయకులు పత్తి వెంకటేశ్, పంతం కృష్ణ, జింకల రామకృష్ణ, కుండె సంపత్, సారాబు సంతోష్, బీజని మధు, ఆలేటి అజయ్, ఎండీ ఫయాజ్, విజయ్, జల్లి నర్సింహులు, పూల శ్రవణ్, టింకు, దయ్యాల సంపత్, శ్రీకాంత్, పాశికంటి శ్రీనివాస్, జూకంటి పెద్ద ఉప్పలయ్య, చిన్న ఉప్పలయ్య, బింగి రవి, భాను, రచ్చ రామనర్సయ్య పాల్గొన్నారు.



ఆలేరులో జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# బలిపీఠంపై బక్క రైతు

## రోజురోజుకు పెరుగుతున్న అన్నదాత ఆత్మహత్యలు

## 15నెలల్లో 40మందికి పైగా సూసైడ్



## అన్నం పెట్టే రైతన్నపై కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం

**ఇటీవల వరుసగా బలవన్మరణాలు**

**అధిక శాతం మంది అప్పు బాధతోనే..**

**సాగు జలాలపై లేని పట్టింపు.. నింపని చెరువులు**

**పత్తాలేని రైతు భరోసా.. అరకొరగా రుణమాఫీ**


**మిత్తిలకు తెచ్చి సాగు చేసినా మిగులుతున్నది అప్పులు, నష్టాలే..**

అన్నదాత బతుకు ఆగమైతున్నది. అన్నం పెట్టే రైతు జీవితం ప్రశ్నార్థకమైతున్నది. ఆరుగాలం కష్టించి పండించిన పంటను కాపాడుకునేందుకు అప్పులపాలై బతుకు బక్కచిక్కిపోతున్నది. ఓ వైపు ప్రభుత్వ నిర్లక్ష్యం.. మరో వైపు కలిసిరాని కాలంతో అన్నదాత అంతిమంగా తనువు చాలిస్తున్నాడు. దిక్కుతోచని స్థితిలో వ్యవసాయ బావుల వద్దే పురుగుల మందు తాగి.. కాటికి కాలు చాపుతుండటం ఆందోళన కలిగిస్తున్నది.

– యాదాద్రి భువనగిరి, మార్చి 16 (నమస్తే తెలంగాణ)

### 40మందికి పైగా తనువు చాలించి..

పదేండ్ల పాటు సంతోషంగా బతికిన రైతులు బక్క చిక్కిపోతున్నారు. వ్యవసాయం సంక్షోభంలో పడి దుఃఖసాగరంలో మునిగి తేలుతున్నారు. మళ్లీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పరిస్థితులు దాపురించాయి. పల్లెల్లో నాటి కష్టాలు కండ్లకు కట్టినట్టు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ 15నెలల కాలంలో ఉమ్మడి నల్లగొండలో సుమారు 40 మందికి పైగా ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇందులో అత్యధికంగా అప్పుల బాధ తాళలేక ప్రాణాలు తీసుకున్నారు. ఇటీవల కాలంలో రైతుల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది.



### సర్కార్ నిర్లక్ష్యమే శాపం..

అన్నదాత ఆత్మహత్యలకు సర్కార్ నిర్లక్ష్యమే శాపంగా మారిందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో సుభిక్షంగా ఉన్న కర్షకులకు కాంగ్రెస్ వచ్చాకే కష్టాలు వచ్చాయని పేర్కొంటున్నారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో ఏనాడూ ఇబ్బంది లేకుండా కంటికి రెప్పలా కాపాడుకున్నారు. కానీ ఏడాదిన్నరలోనే రైతులు ఎన్నో ఆటు పోట్లు ఎదుర్కొంటూ అరిగోస పడుతున్నారు. గత యాసంగిలో రైతు భరోసా ఎగవేత, అరకొరగా రుణమాఫీ, చెరువులను నింపకపోవడం, గతంలో మాదిరి కాళేశ్వరం జలాలు అందించకపోవడం, నాగార్జున సాగర్ ఆయకట్టులో పూర్తి స్థాయిలో నీటి విడుదల లేకపోవడం, లో ఓల్టేజ్ కరెంట్ కష్టాలు, ధాన్యం కొనుగోళ్లలో విఫలం, ఎండిపోతున్న పొలాలు, కరువు ఛాయలు తదితర అనేక కారణాలతో రైతులు ఆగమయ్యే పరిస్థితి వచ్చింది. ప్రస్తుత సీజన్‌లో దిగుబడి సమయం వచ్చినా పెట్టుబడి డబ్బులు ఇంకా జమ చేయలేదు. దీంతో అనేక మంది ప్రైవేట్‌లో వడ్డీలకు తెచ్చి సాగు చేశారు.

### ఆఖరికి మిగులుతున్నది అప్పులు.. నష్టాలే..

పంట చేతికొచ్చేందుకు అన్నదాత ఎన్ని కష్టాలు పడుతున్నా ఆఖరికి అప్పులు, నష్టాలే మిగులుతున్నాయి. కనీసం పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఉంది. సుమారుగా ఒక్కో ఎకరానికి రూ. 26 వేల వరకు పెట్టుబడి పెట్టారు. ఇందులో దున్నకాలు, నాట్లు, ఫర్టిలైజర్, విత్తనాలు, మందులు, కూళ్లు, ఇతర పనులకు ఖర్చు చేశారు. ఇక ఒక్కో ఎకరానికి సుమారుగా 28 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుంది. ఒక్కో క్వింటాల్ రూ. 2వేలు అనుకున్నా రూ. 56 వేలు అవుతుంది. అంటే ఎకరం భూమి సరిగ్గా పంట దిగుబడి వస్తే పెట్టుబడి పోగా రూ. 33వేలు లాభం వస్తుంది. ఇప్పుడు పంటలు ఎండిపోతుండటంతో ఎకరానికి రూ.30 వేల దాకా నష్టం వాటిల్లినట్లు తెలుస్తున్నది. ఇటు నష్టాలు, అటు అప్పులతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

## లో ఓల్టేజీ సమస్యలు లేకుండా చర్యలు

**• క్షేత్రస్థాయిలో పరిశీలించిన విద్యుత్ అధికారులు**
**• 'రైతన్నకు కరెంట్ కష్టాలు' కథనానికి స్పందన**



మునుగోడు మండలం కల్వలపల్లిలో కరెంట్ లైన్లు పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు

మోత్కూరు, మార్చి16 : జిల్లాలో విద్యుత్ కోతలు లేకుండా, లో ఓల్టేజీ సమస్య లేకుండా మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని ట్రాన్స్‌కో భువనగిరి డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు. 'రైతన్నకు కరెంట్ కష్టాలు' శీర్షికన నమస్తే తెలంగాణ జిల్లా పేజీలో ఆదివారం ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు మండలాల్లో ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ సరఫరా తీరుపై క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. జిల్లాలో ఎక్కడ ఏమి పనులు చేశారో భువనగిరి డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు. మోత్కూరు మండలం బుజిలాపురం 132/33 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని మోత్కూరు, గుండాల, ఆత్మకూరు(ఎం), అడ్డగూడూరు మండలాల రైతులకు వ్యవసాయానికి లో ఓల్టేజీ లేకుండా మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకున్నారు. మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని ఇంగిసమ్మ కుంట సమీపాన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ట్రిప్పింగ్ సమస్యను పరిష్కరించారు. ఆత్మకూరు(ఎం) మండల పరిధిలోని పల్లెర్ల సబ్ స్టేషన్ పరిధిలో లో ఓల్టేజీ సమస్య లేకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. రాజాపేట మండలంలోని బొందుగుల సబ్‌స్టేషన్‌లో లో ఓల్టేజీ సమస్య లేకుండా 5ఎంఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తగా 8ఎంఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. అదే విధంగా వేసవి కాలం కావడంతో జిల్లాలో సాంకేతిక సమస్యలు ఉన్న 104 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి వాటి స్థానంలో 91 త్రీ హెచ్‌పీ కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, 13 వన్ హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. వివరించారు. జిల్లాలో ఎక్కడైనా విద్యుత్ సమస్యలు తలెత్తితే 949106 5938 కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని ఎస్ఈ కోరారు.



ఆత్మకూరు(ఎం) మండలంలో విద్యుత్ తీగల వద్ద ఓల్టేజీ పరిశీలన

మునుగోడు : మునుగోడు మండల పరిధిలోని కల్వలపల్లి, సింగారం గ్రామాల్లో లో ఓల్టేజీపై డీఈ అన్నయ్య, ఏడీఈ ఆశోక్‌కుమార్, ఏఈ సురేశ్‌కుమార్ పర్యటించారు. కరెంట్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. ప్రస్తుతం లో ఓల్టేజీ సమస్య లేదని, భూగర్భ జలాలు అడుగంటడంతో నీళ్లు పోయడం లేదని అధికారులు తెలిపారు. వేసవి దృష్ట్యా మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.



కల్మెర గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్

## ప్రారంభానికి నోచుకోని విద్యుత్ సబ్ స్టేషన్

**• కరెంట్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులు**

కట్టంగూర్, మార్చి 16 : మండలంలోని కల్మెర గ్రామ శివారులో నూతనంగా చేపట్టిన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. దాంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మునుకుంట్ల, కల్మెర, పరడ ఫీడర్లలో లోఓల్టేజీ సమస్య తీర్చి వ్యవసాయానికి, గృహాలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ 33/11కేవీ ఉప కేంద్ర నిర్మాణానికి రూ.కోటి నిధులు మంజూరు చేసింది. 2023 ఆగస్టు 21న అప్పటి ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. సదరు కాంట్రాక్టర్ నిర్మాణ పనులను జాప్యం లేకుండా మైన్‌లైన్ నుంచి నాలుగు లైన్ల స్తంభాలకు తీగలు, సబ్ స్టేషన్‌లో స్తంభాలు, ఏబీ స్విచ్‌లు, బేకర్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మార్ అమర్చి నిర్మాణ పనులు పూర్తి చేశారు. సబ్‌స్టేషన్ పూర్తయినా సంబంధిత అధికారులు సబ్‌స్టేషన్‌ను ప్రారంభించడంలో జాప్యం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి సబ్ స్టేషన ప్రారంభించి విద్యుత్ సమస్య తీర్చాలని రైతులు కోరుతున్నారు. ఇదే విషయంపై సంబంధిత ఏఈ హుస్సేన్‌ను సంప్రదించగా త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు.

## లారీ, బస్సు ఢీ.. 11 మందికి గాయాలు

చందంపేట(దేవరకొండ), మార్చి 16 : దేవరకొండ పట్టణ శివారులోని ఉప్పువాగు వద్ద ఆదివారం రాత్రి ఆర్టీసీ బస్సు లారీని వెనుక నుంచి ఢీకొట్టిన ఘటనలో 11 మందికి గాయాలయ్యాయి. సీఐ నర్సింహులు తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం మిర్యాలగూడ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు దేవరకొండ నుంచి మిర్యాలగూడకు బయల్దేరింది. దేవరకొండ పట్టణ శివారులోని ఉప్పువాగు వద్దకు చేరుకోగానే ముందు వెళ్తున్న లారీ ఒక్కసారిగా సడన్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో 11 మందికి గాయాలు కాగా క్షతగాత్రులను చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## కాంగ్రెస్ అవగాహన రాహిత్యంతోనే ఎండుతున్న పంటలు

**• ఎండిన పంటలకు ఎకరాకు రూ. 50వేల నష్ట పరిహారం ఇవ్వాలి**
**• స్థాయి మరిచి మాటలు మాట్లాడుతున్న సీఎం రేవంత్**
**• మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి సస్పెన్షన్ అప్రజాస్వామికం**
**• మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య**



చిట్యాల మండలం వెల్మినేడులో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు ఎండిన వరి కంకులను చూపిస్తున్న రైతు

చిట్యాల, మార్చి 16 : సమైక్య పాలనలో బీడు భూములుగా మారిన తెలంగాణను బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో పచ్చని పంట పొలాలుగా మార్చిందని, కానీ ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో తిరిగి బీడు భూములుగా మారుతున్నాయని, కాంగ్రెస్ సర్కారు అవగాహన రాహిత్యంతోనే చేతికొచ్చిన పొలాలు ఎండిపోతున్నాయని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. ఎకరానికి దాదాపు రూ.35 వేల వరకు ఖర్చు చేసి, రెండున్నర నెలలుగా శ్రమదానం చేసిన రైతులకు నీళ్లు లేక పంటలు ఎండుతున్నాయని, ఎండిన పొలాలకు ఎకరాకు రూ. 50వేల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. చిట్యాల మండలంలోని వెల్మినేడు గ్రామంలో ఆదివారం ఆయన ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. నీళ్లు లేక బోర్లు ఎండి పోయి సగం పొలాలు ఎండిపోతే, లో ఓల్టేజీ కారణంగా మోటర్లు కాలి పోయి సగం పొలాలు ఎండిపోతున్నాయని రైతులు చిరుమర్తి దృష్టికి తీసుకువచ్చారు. పొట్టకొచ్చిన పంటలు దక్కకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చిరుమర్తి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు సంక్షేమాన్ని గాలికొదిలేసి ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు రైతు భరోసా, రుణ మాఫీ చేస్తామని బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చాక రైతులకు మేలు చేయడం లేదని మండిపడ్డారు. రుణ మాఫీ పూర్తిగా చేయలేదని, రైతు భరోసా మొక్కుబడి ఇస్తున్నారని, ఉచిత విద్యుత్ 10 గంటలు కూడా వస్తలేదని, అదికూడా లోఓల్టేజీతో వస్తుందని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ కుటుంబం మీద, బీఆర్ఎస్ ప్రభుత్వం మీద సోషల్ మీడియాలో విష ప్రచారం చిమ్మిన రేవంత్ ఇప్పుడు నిజమైన వార్తలు ప్రచారం చేస్తే సోషల్ మీడియా, యూ ట్యూబర్లపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ సాక్షిగా తను ముఖ్యమంత్రిని అన్న విషయాన్ని మరిచి మాటలు మాట్లాడుతున్నాడని, మీడియాపై విషం కక్కుతున్నాడని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే దమ్ములేని రేవంత్‌రెడ్డి పోలీసు రాజ్యం నడుపుకుంటూ మైకులలో ఊదరగొడుతున్నాడని దుయ్యబట్టారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి సస్పెన్షన్ అప్రజాస్వామికమని, వెంటనే సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు దేవరపల్లి సత్తిరెడ్డి, రాచకొండ కిష్టయ్య, కొలను వెంకటేశం, ఎ.శ్రీశైలం, బొంతల రామకృష్ణారెడ్డి, కొలను సతీవ్, దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జినుకల ప్రభాకర్, అంతటి రాకేశ్, బైకాని నర్సింహ, మాస జగన్, గుర్రం యాదయ్య, పబ్బు చంద్రశేఖర్, అరూరి ధనుంజయ్య ఉన్నారు.

### ట్యాంకర్‌తో పంటను కాపాడుకుంటున్నాం

నాలుగున్నర ఎకరాల్లో వరి పంట వేసిన. నీళ్లు లేక రెండున్న ఎకరాలు ఎండిపోయింది. నాకు నాలుగు బోర్లు ఉంటే అందులో మూడు ఎండిపోయినయి. గతంలో ఎప్పుడూ ఇట్లాంటి పరిస్థితి రాలే. మిగిలిన పొలాన్నైన బతికించుకోవడానికి రోజూ ట్యాంకర్‌కు 1500 రూపాయలు ఇచ్చి నీళ్లు పోయిస్తున్నా. లో ఓల్టేజీ సమస్య వల్ల నాలుగు సార్లు మోటర్లు కాలిపోయినయి. ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక పోతున్నా.

**- మంకాల బాలయ్య, రైతు, వెల్మినేడు, చిట్యాల మండలం**

### ఎకరన్నర ఎండింది..

పొట్టకొచ్చిన పంట ఎండిపోయింది. చేసేదేమీ లేక జీవాలను మేపుతున్నా. బోర్లలో నీళ్లు అడుగంటిపోయినయి. లో ఓల్టేజీ సమస్యతో సతమతమవుతున్నాం. రెండెకరాల్లో వరి వేస్తే ఎకరన్నర ఎండిపోయింది. మూడు బోర్లకు మూడు బోర్లలో నీళ్లు తగ్గినయి. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఇలాంటి సమస్య ఎదుర్కోలే. అప్పులు కరెంటు కొరత లేదు.. లో ఓల్టేజీ సమస్య లేదు.

**- ఏనుగు మల్లారెడ్డి, రైతు, వెల్మినేడు, చిట్యాల మండలం**